క్లుప్తంగా

ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి అని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని బానకచర్ల గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో జరిగే ఎన్‌పీసీఐ(ఇన్‌యాక్టివ్ అకౌంట్స్ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వే) పరిశీలించారు. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఆధార్ లింక్ కాని ఖాతాదారుల జాబితా సచివాలయాలకు అందజేశామన్నారు. ఎంపీడీఓ వెంట సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఆధార్ క్యాంప్ పరిశీలన



ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధార్ నమోదు తప్పనిసరి అన్నారు. వారి విద్యార్హత ధృవీకరణ పత్రాల్లో నమోదైన విధంగానే ఆధార్ కార్డుల్లో కూడా పేరు, పుట్టిన తేదీ ఒకేలా ఉండాలన్నారు. తప్పులకు అవకాశం లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు ఆధార్ క్యాంప్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజా హక్కుల సభను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు తలపెట్టిన ప్రజాహక్కుల సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు గాలి రవిరాజు పిలుపునిచ్చారు. సోమ వారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ప్రజా హక్కుల సభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. డిసెంబర్ 4న విజయవాడలో జరిగే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రంగస్వామి, సాగర్, వెంకటరమణ, అరుణ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో రైతులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఇరిగేషన్ ఏఈ గౌతమ్, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మౌలానా సేవలు మరవలేనివి



మౌలానా విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

నందికొట్కూరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు మరవలేనివని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని కాలేజీ రోడ్డులో జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా స్థూపం వద్ద మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ మొటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరవలేనివన్నారు. రాజనీతి శాస్త్రంలో పట్టు సాధించిన గొప్ప వ్యక్తి మౌలానా అన్నారు. పేదరికాన్ని జయించే శక్తి చదువుకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు జలహారతి

● పోటెత్తిన భక్తులు



మహానందిలో హారతి పూజలు చేస్తున్న పండితులు

మహానంది: పరమ పవిత్రమైన కార్తీకమాసం పురస్కరించుకుని రెండో సోమవారం రాత్రి మహానందిలోని రుద్రగుండం(పెద్దకోనేరు)లో జలహారతి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, మూలస్థానం శంకరయ్యశర్మ, ముఖ్య అర్చకులు టీవీ రాజ మాణిక్యశర్మ, రాజారత్తయ్యబాబు.. గంగాదేవికి షోడశోపచార పూజలు చేసి సారె సమర్పించారు. అనంతరం హారతులిచ్చారు. వేలాది మంది భక్తులు పాల్గొని జలహారతులను భక్తిశ్రద్ధలతో వీక్షించి ఓం నమో మహానందీశ్వరాయ.. అంటూ ప్రణమిల్లారు. నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి ఓ సాధారణ భక్తురాలిగా కూర్చుని భక్తిశ్రద్ధలతో జలహారతిని వీక్షించి మహానందీశ్వరుడికి పూజలు చేశారు. అలాగే జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. అభిషేక ప్రియుడైన మహానందీశ్వరస్వామికి 81 రుద్రాభిషేకాలు, 21 క్షీరాభిషేకాలు జరగగా సుమారు వంద మందికి పైగా భక్తులు కేదారేశ్వరనోములను నోచుకున్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు సాధారణ, ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ల ద్వారా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా ఆలయానికి ఒకేరోజు సుమారు రూ.ఆరు లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

● ఓంకార క్షేత్రంలో..



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి కార్తీక మాస రెండో సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పంచముగ్గల కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి ఓంకార సిద్దేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. తర్వాత వ్యాస మహర్షిచే ప్రతిష్ఠింపబడిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై ప్రతిష్ఠించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాలినడకన వెళ్లి సందర్శించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

● రుద్రకోడు క్షేత్రంలో..



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని రుద్రకోడు క్షేత్రంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, రుద్రాణి మాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే పట్టణంలోని శివాలయాల్లో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. మహిళలు వేకువజామునే శివాలయాల్లో మహాశివుడు పార్వతీమాతను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.

రైతులకు పెట్టుబడి సాయమేదీ?



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పగిడ్యాల: సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమితి జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చి 5 నెలలు అవుతున్నా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా అందించలేదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయకుండా కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలకు ప్రభుత్వమే పంటల బీమా సొమ్మును భరించి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఏసన్న, రమణ, సామన్న, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ జయంతి



ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మొయినుద్దీన్ మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యా రంగానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శర్మ, శ్రీనివాస్ ఆచారి, రమాదేవి, వెంకట సుబ్బయ్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

– **శ్రీశైలం ప్రాజెక్ట్:** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సోమవారం సున్నిపెంట ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, అధ్యాపకులు కె.సూర్యనారాయణ, ఎంజె.విజయప్రసాద్ పాల్గొన్నారు.

– **బండిఆత్మకూరు:** స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి జి.మోహన్‌రెడ్డి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు గుదిబండలా క్రిమీలేయర్

● బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

శ్రీశైలం: వెనుకబడిన తరగతుల కులాలలో క్రిమీలేయర్ గుదిబండలా మారిందని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామి దర్శనార్థమై వచ్చిన ఆయన రాష్ట్ర బీసీ సంఘ సభ్యుల, బీసీ సంఘాల నాయకులతో స్థానిక యాదవ సత్రంలో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ సంఘ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఇటీవల ఢిల్లీలో చేసిన ధర్నాకు ప్రభుత్వం స్పందించిందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. క్రిమీ లేయర్ పట్ల అవగాహన లేకపోవడంతో బీసీలు, ఓబీసీ సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారన్నారు. సంఘం జిల్లాల అధ్యక్షులు సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జీకే వెంకటరాముడు, మూల వెంకటసుబ్బయ్య, కూరాకుల బాపయ్య, గోర్ల వెంకటసుబ్బయ్య, యాదవ సత్రం మేనేజర్ శివయ్య యాదవ్ పాల్గొన్నారు.

వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పదవి బోయలకే ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకి బోయ సంఘం నాయకులు

నందికొట్కూరు: వాల్మీకులు కాదని బహిరంగంగా చెప్పిన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టడం సరికాదని వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకుడు గుజ్జుల గౌరీశ్వరనాయుడు అన్నారు. ఆమెను తప్పించి బోయ, వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఆ పదవి ఇవ్వాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వాల్మీకి కాదని ప్రసార మాధ్యమాల ద్వారా బొజ్జమ్మనే ప్రకటించారని గుర్తు చేశారు. అలాంటి మహిళకు వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంఘం నాయకులు లక్ష్మినాయుడు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పంట కాల్వలు ఏర్పాటు చేయాలి



డీటీ పఠాన్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పాములపాడు: మండల కేంద్రంలోని చెలిమిల్ల రస్తాలో ఉన్న పంట పొలాలకు కాల్వలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబుకు రైతులు వినతి పత్రం అందజేశారు. నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా పంట కాల్వలను పూడ్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారు 100 ఎకరాల పొలాలకు సాగు నీరు అందక సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. సాగులో ఉన్న పంటలు నీరందక వాడిపోతున్నాయని తెలిపారు. కాల్వల నిర్మాణం చేపట్టి పంటలను కాపాడాలని లేదంటే హైవే నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతులు రాజు, పుల్లయ్య, శేఖర్, రామదాసు, చిన్న వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్ ఉన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రం



జూపాడుబంగ్లా ఒకటో అంగన్‌వాడీ కేంద్రం

జూపాడుబంగ్లా: తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ చొరవతో ఎట్టకేలకు జూపాడుబంగ్లా ఒకటో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు సోమవారం తెరుచుకున్నాయి. మరమ్మతుల కారణంగా రెండు నెలల క్రితం బొద్దురాయి సందులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సంతగేటు సమీపంలోని మహిళా మండలి భవనంలోకి మార్చారు. సమీపంలోని ఆంజనేయ స్వామి గుడిపూజారి గాలెన్న అంగన్‌వాడీ కేంద్రం తనదంటూ కేంద్రానికి ఐసీడీఎస్ అధికారుల ముందే తాళం వేశాడు. దీనిపై పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జోక్యం చేసుకుని గాలెన్నకు నచ్చజెప్పడంతో సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన తాళాన్ని వీఆర్వో సాయిబాబా తెరిపించారు. సంతగేటు సమీపంలోని మహిళా మండలి భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బొద్దురాయి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

బండిఆత్మకూరు: రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘాల మండల కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం కార్యదర్శి ఎం.డేవిడ్, నాయకులు టి.రామచంద్రుడు, రాజు, అబ్రహం, రవి, మాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు బస్సు సర్వీసు నడపాలని వినతి

నందికొట్కూరు: కర్నూలు పట్టణానికి విద్యార్థి బస్సు సర్వీసును నడపాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్ యాదవ్‌క్ కోరారు. ఈ మేరకు సోమవారం నందికొట్కూరు ఆర్టీసీ డిపో కార్యాలయంలో డీఎంకు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాయంత్రం వేళ్లలో కర్నూలు పట్టణం నుంచి నందికొట్కూరుకు విద్యార్థి బస్సులను నడపాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు రమేష్, రాము ఉన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

బండిఆత్మకూరు: ఆకతాయిలకు జైలు శిక్ష విధించిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కడమల కాలువ గ్రామానికి చెందిన మధు వంశీ, నాగబాబు అనే యువకులు గ్రామంలో న్యూసెన్స్ చేస్తుండడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 7 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన ఎం.ప్రణతి, వేదాంతం కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బృందాల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

ఆధార్ క్యాంపు ఏర్పాటు

బండిఆత్మకూరు: స్థానిక జూనియర్ కాలేజీలో సోమవారం ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆధార్‌లో తప్పులు సవరించుకోవచ్చని మండల విద్యాశాఖాధికారి జి.మోహన్‌రెడ్డి తెలిపారు. రేపు, ఎల్లుండి కూడా ఆధార్ క్యాంప్ ఉంటుందని, మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

హామీలు నెరవేర్చాలి



ప్రజాపోరు యాత్రను ప్రారంభిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కూటమి నేతలు ఎన్నిక సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్ డిమాండ్ చేశారు. సోమవారం గరీబ్‌నగర స్వరాజ్‌నగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, అక్కిరాజు కలనీ, పద్మావతినగర్ తదితర కాలనీల్లో ప్రజాపోరు యాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, బెల్ట్ షాపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కాలనీలో రోడ్లు, కాలువలు, తాగునీరు అందించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేయకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, జి.నాగేశ్వర్ రావు, కిరణ్, మహమ్మద్, గణపతి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై అవగాహన

ఆత్మకూరురూరల్: మున్సిపల్ పరిధిలోని అక్రమ లేఅవుట్లపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థిరాస్తి వ్యాపారులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి బోయలకే ఇవ్వాలి

శ్రీశైలంప్రాజెక్ట్: బోయ కార్పొరేషన్ చైర్మన్ పదవిని బోయ కులానికి చెందిన వారికే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నల్లబోతుల మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ఉపాధి కూలీ మృతి

ఆత్మకూరు రూరల్: ఉపాధిహామీ కూలీ గోపాల్ రెడ్డి(55) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి సోమవారం ఉదయం ఉపాధి పనులకు బయలుదేరాడు. మార్గమధ్యలో కాలువ దాటుతుండగా అక్కడికక్కడే కుప్ప కూలాడు. గుండెపోటు రావడంతో మృతిచెంది ఉండవచ్చని, ప్రభుత్వం అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కూలీలు కోరారు.

ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సోమవారం ప్రపంచ సైన్స్ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలకు 36 పాఠశాలల నుంచి 360 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌బాషా, కో ఆర్డినేటర్ ఆనంద్ గురూజీ తెలిపారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు. ముందుగా ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెంప్రీ డ్యూనాంట్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో అవయవదానం గురించి అవగాహన విద్యార్థుల పాత్ర అనే అంశంపై, పర్యావరణ పరిరక్షణలో కృత్రిమ మేధా పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలను ఈనెల 14వ తేదీన కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

సర్వేలు పకడ్బందీగా చేపట్టండి

వెలుగోడు: ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్వేలు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో సిబ్బంది ఇంటింటికి తిరిగి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే అకౌంట్ నెంబర్‌కు ఎన్ పీసీఐ లింకు చేయించాలన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు సుంకన్న, నాగేశ్వరరెడ్డి, ప్రవీణ్ నాయక్, స్వాతి, నాగరాజు, హసన్, సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి

ఆత్మకూరు: బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహార్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 9.8 శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది తక్కువ అని, ఏ మాత్రం సరిపోవన్నారు. 30 శాతం నిధులు కేటాయించి పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు.

మొక్కలకు కంచెగా పలకలు



అంగన్‌వాడీ కేంద్రం వెనుక న్యూట్రిగార్డెన్ చుట్టూ కంచెగా పెట్టిన పలకలు

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అక్షరాలు నేర్పేందుకు ఇచ్చిన పలకలు మొక్కలకు కంచెగా ఉపయోగించడాన్ని చూస్తే అవాక్కవాల్సిందే. మండలంలోని రామసముద్రం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పది నెలల క్రితం చిన్నారులకు అక్షరాలు నేర్పించేందుకు ప్రభుత్వం పలకలు మంజూరు చేసింది. మంజూరు చేసిన పలకలపై చిన్నారులకు అక్షరాలు పెట్టి వారితో దిద్దించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు చిన్నారులకు ఎంతవరకు అక్షరాలు నేర్పించారో దేవుడికెరుకగానీ వారిచ్చిన పలకలపై పెట్టిన అక్షరాలు చెరిగిపోకముందే వాటిని అంగన్‌వాడీ కేంద్రం వెనకాల ఉన్న న్యూట్రిగార్డెన్‌కు కంచెగా ఉపయోగించడాన్ని చూస్తే ఎవరైనా అవాక్కవ్వక తప్పదు. వీటిని చూస్తే అంగన్‌వాడీ కేంద్రాలపై ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ ఎలాగుందో అర్థం చేసుకోవచ్చు.



పలకలపై అక్షరాలు చెరిగిపోకముందే తోటకు కంచెగా మారిన పలకలు